ప్రజాశక్తి

శనివారం 3 మే 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పోలీసుల అదుపులో ఇద్దరు.?

- కొలిక్కివస్తున్న టిడిపి నేత వీరయ్య హత్య కేసు
- ఎస్పీ దామోదర్ ప్రత్యేక దర్యాప్తుతో నేరస్తుల ఆచూకీ లభ్యం
- సూత్రధారులు ఎవరన్న దానిపై మరింత లోతుగా విచారణ



వీరయ్యచౌదరి హత్యకేసులో దర్యాప్తు నిమిత్తం బైక్‌పై వెళుతున్న ఎస్పీ దామోదర్ (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

టిడిపి నేత, మాజీ ఎంపిపి వీరయ్య చౌదరి హత్యకేసు కొలిక్కి వస్తోంది. ఇద్దరు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం. ఎస్పీ దామోదర్ ఈ కేసును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నేరం జరిగిన క్షణం నుంచీ ఇప్పటి వరకూ ఆయన ఈ కేసుపైనే సర్వశక్తులూ పెట్టారు. వీలైనంత త్వరగా కేసును ఛేధించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దర్యాప్తు బృందాలకు తగిన సూచనలు ఒక వైపు ఇస్తూనే.. మరో వైపు తానే స్వయంగా ఏం చేయాలో దాన్ని పక్కా ప్రణాళికతో చేస్తున్నారు. ఎస్పీ అనే భావన వీడి మోటారుసైకిల్‌పైనా తిరిగి నేరస్తుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇప్పటికే ఈ కేసులో చాలా వరకూ స్పష్టత వచ్చింది. ఎవరు చేశారు? ఎందుకు చేశారు? కారణాలు ఏమిటనే దానిపై పోలీసు అధికారులు ఓ అవగాహనకు వచ్చారు. అయినా దాన్ని ఒక ఆలోచనకు పరిమితం చేయకుండా మూలాలను వెలికితీసే పనిలో ఉన్నారు. మరింత లోతుగా విచారణ సాగిస్తున్నారు. మొదట గంటలోనే వీరయ్యకు రాజకీయంగా వైరం ఉన్న అమ్మనబ్రోలుకు చెందిన

▶ 2లో

అమరావతిపై మళ్లీ ఆశలు.!

- పెట్టుబడిదారులు, రియల్టర్లలో కొత్త ఉత్సాహం
- శింగరాయకొండ-మాలకొండ మధ్య రహదారి ప్రారంభం



శింగరాయకొండ-మాలకొండ మధ్య రహదారి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

అమరావతి పున:ర్నిర్మాణ పనులను శుక్రవారం నాడు ప్రధాని మోడీ ప్రారంభించారు. జిల్లా నుంచి 5 వేల మందిని బస్సుల్లో ప్రధాని సభకు పార్టీ నేతలు తరలించారు. నియోజకవర్గాల్లో బస్సులను ఎమ్మెల్యేలు జెండాలు ఊపి.. ప్రారంభించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సభకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. అమరావతి పునర్నిర్మాణ పనులతో పాటు కొన్ని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిగాయి. సిఎస్‌పురం నుంచి పామూరు, మాలకొండ, కందుకూరు మీదుగా శింగరాయకొండ వరకూ నూతనంగా నిర్మాణం చేసిన రహదారి ప్రధాని ప్రారంభోత్సవాల్లో ఉంది. ఈ రహదారి ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఇక అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభం పెద్ద చర్చగా మారింది. కూటమి పార్టీలు దీనిపై వారం రోజులుగా దృష్టిపెట్టాయి. జన సమీకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. గతంలో ఆగిపోయిన అమరావతిని మళ్లీ చేపట్టారనే ప్రచారం పెద్దఎత్తున చేశారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిందనే ప్రచారాన్ని కూడా జనంలోకి తీసుకుపోయే యత్నం మరోసారి చేశారు. మళ్లీ అమరావతిపై కొన్ని వర్గాల్లో కొత్త ఆశలు కలుగుతున్నాయి. ప్రధానంగా రియర్‌ఎస్టేట్ వ్యాపారులు, నిర్మాణ కంపెనీలు ఉత్సాహం కనబరుస్తున్నాయి. రూ.49 వేల కోట్లతో అమరావతి పనులకు టెండర్లు పూర్తి చేశారు. వీటిపై పెద్దపెద్ద కాంట్రాక్టర్లలోనూ ఆశలు కలుగుతున్నాయి. కొన్ని భారీ కంపెనీలు ఈ పనులను దక్కించుకున్నా సబ్ కాంట్రాక్టులూ ఉంటాయి. నిర్మాణరంగంలో ఉన్న ఎమ్మెల్యేలూ వీటిపై దృష్టి పెట్టారు. వాటిని దక్కించుకుంటే కొంత ఆర్థిక వెసులుబాటు వస్తుందని భావిస్తున్నారు. బిల్డర్లు కూడా ఆశలు పెట్టుకున్నారు. ఇప్పటికే అక్కడ పనులు చేపట్టి మధ్యలో వదిలేసిన కంపెనీలు మళ్లీ ఇటీవల పనులు చేపడుతున్నాయి. ఇక జిల్లా నుంచి అనేక మంది అక్కడ భూములు కొన్నారు. వాటి ధరలు కొంత పెరగడంతో కొందరు అమ్ముకున్నారు. ఇంకా అనేక మందికి అక్కడ భూములు ఉన్నాయి. వాటి ధరలు పెరుగుతాయనే ఆశలో ఉన్నారు. కొత్తగా భూములు కొనుగోలు చేసేందుకు ఇతర ప్రాంతాల నుంచి వెళుతున్నారు. కొత్త ప్రాజెక్టులపైనా

▶ 2లో

గిట్టుబాటు ధరేదీ.?

- అరకొర ధర పలుకుతున్న అపరాలు
- నష్టపోతున్న అన్నదాతలు



ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పతనం కావడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధాన్యం, మిర్చి, అపరాలు వీటన్నింటికీ ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. దీంతో రైతులు డీలా పడిపోయారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించిన దాఖలాలు లేవు. ధాన్యం విషయానికొస్తే రబీ కొనుగోళ్లలో అలసత్వం కనిపిస్తోంది. అధికారులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మిల్లర్లు కొనుగోలుకు ముందుకు రావడం లేదు. దీంతో ఒక్కసారిగా దళారులు ముందుకు వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. ఫలితంగా నియోజకవర్గ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు. త్రిపురాంతకం, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

మిర్చి క్వింటా రూ.9 వేలు నుంచి రూ.13 వేల లోపే కొనుగోలు చేస్తున్నారు. అది కూడా ఫస్ట్ క్వాలిటి అయితేనే. కాస్త క్వాలిటీ తక్కువగా ఉంటే క్వింటా ధర రూ.8 వేలకు మించి పలకడం లేదు. ధాన్యం ధర గత ఏడాది రూ.1400 నుంచి రూ.1600 ఉండగా ఈ ఏడాది రూ.1200 నుంచి రూ.1400 వరకే పలుకుతోంది. ధాన్యంలో తేమ ఎక్కువగా ఉందని దళారులు తమకు ఇష్టం వచ్చిన ధరను చెబుతూ కొనుగోలు చేస్తున్నారు. చేసేదేమీ లేక వచ్చిన కాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. ఇదే క్రమంలో కందులు, శనగ ధరలు సైతం పూర్తిగా దిగజారిపోయాయి. అవి కూడా రూ.7 వేలకు మించి ధర పలకడం లేదు. మినుములు గత ఏడాది రూ.9500 ఉండగా ప్రస్తుతం రూ.7 వేల ధర పలుకుతోంది. రైతులు పండించిన పంటను కొనుగోలు విషయంలో పట్టించుకోవలసిన వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

70 శాతం మంది వ్యవసాయంపైనే..

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో 70 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవిస్తున్నారు. రైతులు ఎప్పుడూ నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులకు మద్దతు ధర లభించని సమయంలో రైతులకు బోనస్ ఇచ్చారు. అదేవిధంగా ప్రస్తుతం కూడా రైతులకు బోనస్ ఇస్తే బాగుంటుందని ఎక్కువ మంది రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దిగుమతి చేసుకోవడంతో..

కేంద్ర ప్రభుత్వం అపరాలను ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవడంతో

▶ 2లో



ప్రభుత్వ బడులను రక్షించుకుందాం

8లో

బాపట్ల జిల్లా నుంచి

అమరావతికి 16 వేల మంది..

- 'పునర్నిర్మాణ' కార్యక్రమం విజయవంతం..
- కలెక్టర్ వెంకట మురళి



బస్సులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

అమరావతి పునర్నిర్మాణ కార్యక్రమానికి బాపట్ల జిల్లా నుండి 16 వేల మంది హాజరయినట్లు కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అధికారులకు అభినందనలు తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అమరావతి పునర్నిర్మాణ కార్య క్రమంకు వస్తున్న సందర్భంగా జిల్లా నుంచి తరలి వెళ్లిన ప్రజలకు కోసం ఏర్పాటు చేసిన బస్సుల కదలికలను తెలుసుకొనేందుకు కలెక్టరేట్లో వీక్షణ సమావేశం మందిరంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. శుక్రవారం కమాండ్ కంట్రోల్ రూమ్ లో బస్సు కదలికలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షించారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల నుండి 380 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అద్దంకి నియోజకవర్గం నుండి 71 బస్సులను ఏర్పాటు చేశామని, అందులో

▶ 2లో

అమరావతిపై మళ్లీ ఆశలు.!

(మొదటిపేజీ తరువాయి)

చర్చ సాగుతోంది. మరో వైపు ప్రధాని మోడీ కూడా అమరావతికి అన్ని విధాలా సహకారం అందిస్తామనే భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటనతో అంతా గందరగోళంగా మారింది. రాజధానిపైనే అందరిలోనూ ఆశలు పోయాయి. ఇప్పుడు మళ్లీ ఊపందుకుంటుందనే చర్చను తెరపైకి తెచ్చారు. ఇప్పటివరకూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూడా పక్కనపెట్టారు. ప్రభుత్వం దృష్టంతా అమరావతి రాజధానిపైనే ఉందని సుస్పష్టమవుతోంది. జిల్లాలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అవసరం ఇదే తరుణంలో ఉంది.

పోలీసుల అదుపులో ఇద్దరు.?

(మొదటిపేజీ తరువాయి)

నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్కడ నుంచే విచారణ ప్రారంభించారు. ఎస్పీ రెండు సార్లు సంఘటనా ప్రదేశానికి వచ్చి పదేపదే పరిశీలన చేశారు. కారకులు ఎక్కడున్నారో గుర్తించి అమ్మనబ్రోలుకూ వెళ్లారు. అక్కడ సంయమనం పాటించాలని సూచించి వచ్చారు. ఎట్టకేలకు సూత్రధారులు, పాత్రధారులు ఎవరనేదానిపై స్పష్టతకు వచ్చారు. దర్యాప్తు వేగవంతం చేశారు. అయితే వీరయ్యను హత్య చేసిన వారిలో ఇద్దరిని ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులు వినియోగించిన వాహనాలను మూడో రోజు స్వాధీనం చేసుకున్న పోలీసులు అక్కడ నుంచి మరింత వేగం పెంచారు. ఒక్కో చిక్కుముడిని దాటారు. నిందితులు పారిపోయిన ప్రాంతాల ద్వారా విచారణ చేపట్టారు. నలుగురు హత్య చేసేందుకు రాగా ఒకరు కింద ఉండగా.. ముగ్గురు నేరుగా వీరయ్యపై దాడి చేసి చంపారు. నలుగురు నిందితుల్లో ఇద్దరు పోలీసులకు దొరికినట్లు సమాచారం. వీరి నుంచి మిగతా విషయాలు రాబట్టే పనిలో ఎస్పీ దామోదర్ నిమగ్నమై ఉన్నారు. అంతా కొలిక్కి వచ్చాక ఈ హత్యలో తెరవెనుక ఉన్న వారిని, తెరపైన ఉన్న వారి వివరాలు వెల్లడించేందుకు పోలీసులు సన్నాహాల్లో ఉన్నారు.

గిట్టుబాటు ధరేదీ.?

(మొదటిపేజీ తరువాయి)

పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించడం లేదు. అతి తక్కువ ధరకు అపరాలు లభిస్తుండటంతో ఎక్కువ మోతాదులో ప్రభుత్వాలు నిల్వ చేసుకోవడం మూలంగా రైతుల వద్ద ఉన్న పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లేకుండా పోతోంది. ఇప్పటికీ నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోని పలు గ్రామాల్లో కల్లాలలోనే తమ పంట ఉత్పత్తులను నిల్వ ఉంచి సరైన ధర కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. తక్కువ ధరకు అమ్ముకోలేక, రైతులు తమ పంట దిగుబడులను నిల్వ చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో పంటలపై పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టవలసిన పరిస్థితి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం దిగుమతులు ఆపితేనే రైతు కొంతమేర కోలుకునే పరిస్థితి ఉంది. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం దష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని కోరుతున్నారు.

రైతులకు బోనస్ ప్రకటించాలి

బయ్యపనేని వెంకట నారాయణ, రైతు, కుందంపల్లి

పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన కాడికే విక్రయిస్తున్నారు. ఫలితంగా రైతాంగం అప్పుల ఊబిలో కూరుకుపోతుంది. ఈ నేపథ్యంలో రైతాంగ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతులకు బోనస్ ప్రకటించాలి.

పంటలకు కనీస గిట్టుబాటు ధర ప్రకటించాలి

మూడావత్ రెడ్డి నాయక్, రైతు, పిల్లికుంట తాండా

అధిక పెట్టుబడులు పెట్టి కంటికి రెప్పలా కాపాడుకున్న రైతాంగానికి పంటల దిగుబడి తీవ్ర నిరాశను కలిగిస్తుంది. పంటలకు గిట్టుబాటు ధర లేక ధరలు వారి ఇష్టానుసారంగా కొనుగోలు చేస్తుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతాంగ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.

వైపాలెం ఏరియా ఆసుపత్రిలో..

త్వరలో 'కంగారూ మదర్ కేర్'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా

తల్లి-శిశువు అనుబంధాన్ని బలోపేతం చేస్తూ తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు అవసరమైన శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడే కంగారూ మదర్ కేర్ (కేఎంసీ) కార్యక్రమాన్ని త్వరలో యర్రగొండపాలెంలోని ఏరియా ఆసుపత్రిలో అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ దేవర యదిద్యా తెలిపారు. ఆయన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 'కంగారూ మదర్ కేర్' అనేది తల్లి తన శిశువును నేరుగా శరీరంపై ఉంచి చర్మానికి చర్మం అనుసంధానంతో కలిగిన ఉష్ణోగ్రతను కల్పించేదన్నారు. ఇది ముఖ్యంగా 2.5 కిలోల కంటే తక్కువ బరువుతో పుట్టిన మల్టీపుల్ ప్రీటర్మ్ బేబీలకు ఎంతో ప్రయోజనకరమైనదని చెప్పారు. తల్లి శరీరం ద్వారా శిశువుకు అవసరమైన వేడిమి లభించడంతో పాటు, హృదయ స్పందన, ఊపిరితిత్తుల పనితీరు మెరుగవుతుందన్నారు. ఈ ప్రక్రియ మానసిక స్థైర్యాన్ని కలిగించి శిశువు ఆరోగ్యాన్ని కాపాడుతుందని వివరించారు. తల్లి పాలు అందించడంలో కూడా ఇది ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యంగా తక్కువ బరువుతో పుట్టిన శిశువుల్లో మరణ శాతం గణనీయంగా తగ్గుతుందని వివరించారు. శిశువు శరీర ఉష్ణోగ్రత సవ్యంగా ఉండేలా చేస్తుందని తెలిపారు. శిశువులో ఇమ్యూనిటీ మెరుగుపడుతుందని చెప్పారు. ఇన్‌ఫెక్షన్ల ముప్పు తగ్గుతుందన్నారు. తల్లి-శిశువు మధ్య ఎమోషనల్ బాండ్ బలపడుతుందని పేర్కొన్నారు. తల్లి పాల ఉత్పత్తి పెరుగుతుందని తెలిపారు. ఆసుపత్రిలో గడిపే రోజులు తగ్గిపోతాయన్నారు. వ్యయభారం తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించేదుకు ప్రత్యేక శిక్షణ పొందిన వైద్య సిబ్బందిని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ప్రత్యేక చొరవతో యర్రగొండపాలెం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ఈ అవకాశం దక్కనుందని చెప్పారు. యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలో ఒక్క ఏడాది కాలంలో 1,460 సాధారణ కాన్పులతో పాటు సిజేరియన్ ఆపరేషన్ల కాన్పులు నిర్వహించినట్లు చెప్పారు. జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. వారం రోజుల్లోనే కంగారు మదర్ కేర్ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిన 10 బెడ్ల సామర్థ్యం కలిగిన ప్రత్యేక రూములు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

'బత్తుల'ను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-సంతనూతలపాడు



బత్తుల బ్రహ్మానందరెడ్డిని సన్మానిస్తున్న వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షులు దుంపా రమణమ్మ తదితరులు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు పార్లమెంటు పరిశీలకులుగా నియమితులైన బత్తుల బ్రహ్మానందరెడ్డిని శుక్రవారం ఆ పార్టీ ప్రకాశం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు దుంపా రమణమ్మ, సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ దుంపా యలమందారెడ్డి, చీమకుర్తి పట్టణ కన్వీనర్ క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి తదితర నాయకులతో పేర్నమిట్టలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, దుశ్శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వింగ్ నాయకులు రావూరి శ్రీనివాసరెడ్డి, ట్రేడ్ యూనియన్ నాయకులు కాకి రవి, బీసీ సెల్ నాయకులు గుంజి ఏడుకొండలు, రాజేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా నుంచి..

అమరావతికి 16 వేల మంది

(మొదటిపేజీ తరువాయి)

3 వేల మంది, బాపట్ల నియోజకవర్గం నుండి 68 బస్సులలో 2750 మంది, రేపల్లె నియోజకవర్గం నుండి 58 బస్సులలో 2500 మంది, వేమూరు నియోజకవర్గం నుండి 52 బస్సులలో 2250 మంది, పర్చూరు నియోజకవర్గం నుండి 72 బస్సులలో 3 వేల మంది, చీరాల నియోజకవర్గం నుండి 59 బస్సులలో 2500 మంది మొత్తం జిల్లా నుండి 16 వేల మంది అమరావతి పునర్ నిర్మాణ కార్యక్రమానికి హాజరయ్యారని పేర్కొన్నారు. బాపట్ల నియోజకవర్గం నుండి వెళ్లే బస్సులకు పొన్నూరు ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన భోజన స్టాల్‌ను కలెక్టర్ తనిఖీ చేసి భోజనం ఏర్పాటును పరిశీలించారు. బస్సులోని ప్రయాణికులకు అన్ని అందాయా, లేదా అని వారిని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేసిన నాలుగు భోజన స్టాల్స్ నుండి ప్రయాణికులందరికీ భోజనం అందజేసినట్లు తెలిపారు. ఈ బస్సులన్నీ కార్యక్రమానికి ఎటువంటి ఆటకం లేకుండా చేరుకున్నాయన్నారు. కార్యక్రమం అనంతరం రాత్రి భోజన సదుపాయాలు కల్పించామన్నారు. అన్ని బస్సులు వారి గమ్యస్థానానికి చేరేవరకు కమాండ్ కంట్రోల్‌లోని సిబ్బంది ఆ బస్సులలోని అధికారులతో నిరంతరం పర్యవేక్షణలో ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. శ్రీనివాసరావు, కమాండ్ కంట్రోల్‌లో విధులు కేటాయించిన సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రైవేటు'లో ఉచిత సీట్లు

ప్రజాశక్తి-మార్కాపురం

ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని మార్కాపురం ఎంఇఒ బి రాందాస్‌నాయక్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఒకటో తరగతి ప్రవేశానికి తల్లిదండ్రులు దరఖాస్తు చేయాల్సి ఉందన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను పేదలకు ఉచితంగా అవకాశం కల్పించిందన్నారు. ఈ నెల 2వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, దివ్యాంగులు, అల్పాదాయం ఉన్న వారు అర్హులన్నారు. ఒకటో తరగతికి 2019 జూన్ 2 నుంచి 2020 మే 31 మధ్యలో జన్మించిన పిల్లలు అర్హులన్నారు. వివరాలకు ఎంఇఓను సంప్రదించాలన్నారు.

పిడుగుపాటుకు 16 మేకలు మృతి

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి పట్టణం, మండల పరిధిలోని పలు గ్రామాలలో శుక్రవారం ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. మండల పరిధిలోని కలగట్ల గ్రామంలో అకాల వర్షంతో పాటు పిడుగు పడటంతో 16 మేకలు మత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన నూకతోటి శివపార్వతికి చెందిన మేకల మంద షెడ్డు వద్ద పిడుగు పడటంతో సుమారురు 16 మేకలు అక్కడికక్కడే మతి చెందాయి. దీంతో సుమారు రూ.3 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితులు తెలిపారు. పిడుగుపాటు కారణంగా జీవనాధారం కోల్పోయామని వారు వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.మేకలు మృతి చెందిన విషయంలో గురించి తెలుసుకున్న మండల పశు వైద్యుడు బత్తుల బాలకష్ణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరు గురించి బాధితులను అడిగి తెలుసున్నాడు. ప్రభుత్వపరంగా పరిహారం అందేలా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. గొర్రెల సహకార సంఘం జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు ప్రమాదం గురించి సంబంధిత శాఖ అధికారుల దష్టికి తీసుకెళ్లారు. మృతి చెందిన ఒక్కో మేకకు రూ. 25 వేలు చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం నాయకులు పివి. శేషయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధితులను పరామర్శించారు. బాధితులకు వెంటనే పరిహారం చెల్లించాలని అధికారులను కోరారు. పిడుగుపాటుకు మేకలు మతి చెందటం బాధాకరమని సిపిఎం కనిగిరి పట్టణ కార్యదర్శి పిసి. కేశవరావు తెలిపారు. మృతిచెందిన ఒక్కో మేకకు రూ. 20 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. రాయితీపై రుణాలు అందించి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులను కోరారు.



పిడుగుపడటంతో మృతిచెందిన మేకలు

పాఠశాలల్లో అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా

5న తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి -కనిగిరి

పాఠశాలలలో అసంబద్ధ విధా నాలకు వ్యతిరేకంగా ఈనెల 5న ఈనెల 5న తహశీల్దారు కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న నిరసనలో ఉపాధ్యాయులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాయబ్ రసూల్, రాష్ట్ర కౌన్సిలర్ పి.రాజకుమార్ కోరారు . కనిగిరి జోన్ కార్యాలయంలో ఎపిటిఎఫ్ కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత కలిగిన అన్ని యూపి స్కూల్స్ కొనసాగించాలన్నారు. ఉన్నత పాఠశాలలో 45 మంది దాటినచోట రెండవ సెక్షన్, ఆపై ప్రతి 35 మందికి అదనపు సెక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాల రెండు ఎస్‌జిటి పోస్టులు మంజూరు చేయాలన్నారు. పెండింగ్ లో ఉన్న మూడు డిఎలు విడుదల చేయాలన్నారు. 12వ పిఆర్‌సి ప్రకటన విడుదల చేయాలన్నారు. 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలని కోరారు. 11వ పిఆర్‌సి ఆర్థిక బకాయిలు విడుదల చేయాలన్నారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు ఉండే విధంగా మోడల్ ప్రాథమిక పాఠశాలలు లేదా బేసిక్ ప్రైమరీ స్కూల్స్ మాత్రమే ఉండాలన్నారు. ప్రాథమి కోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లను కొనసాగించాలన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు కెవి.సుబ్బయ్య, షేక్ హుస్సేన్, కె.రామ్మోహన్, పి. మాలకొండయ్య, ఎన్‌వి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయబ్ రసూల్



బోల్తా కొట్టిన టూరిస్టు బస్సు

టూరిస్టు బస్సు బోల్తా

18 మందికి స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టూరిస్టు బస్సు అదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో 18 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన మార్టూరు సమీపంలోని రాజుపాలెం ట్రక్ పార్కింగ్ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం ,శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన 36 మంది దైవదర్శనం కోసం టూరిస్టు బస్సులో తిరుపతి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం స్వగ్రామాలకు బయలు దేరారు. బస్సు రాజుపాలెం స్టేజీ దాటగానే జాతీయ రహదారి నిర్మాణ పనుల కోసం తవ్విన గోతిలో పడి అదుపు తప్పి బోల్తాకొట్టింది. నిద్రమత్తులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురై హాహాకారాలు చేశారు. ప్రమాదాన్ని గుర్తించిన హైవే మొబైల్ పోలీసులు ట్రక్ పార్కింగ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని బస్సు అద్దాలు పగలగొట్టి అందులోని ప్రయాణికులను బయటకు తీశారు. అనంతరం క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మరో బస్సులో వారిని స్వ గ్రామాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాస్కెట్ బాల్ శిక్షణా శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి -పామూరు

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మరియు ప్రకాశం జిల్లా క్రీడాభివద్ధి ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సెయింట్ మార్క్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో వేసవి బాస్కెట్ బాల్ శిక్షణా శిబిరాన్ని ఒంగోలు ఆంజనేయులు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రిన్సిపల్ జయకుమార్ విద్యార్థులకు చదువుతోపాటు ఆటలలో నైపుణ్యత ఎంతో అవసరమన్నారు. ప్రతి విద్యార్థికి విద్యతో పాటు ఆరోగ్యం కూడా అవసరమన్నారు. ఆటల వల్ల ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. వేసవి శిక్షణా శిబిరం ఈనెల 2 నుంచి 31 వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6.00 గంటల నుండి 8.00 గంటల వరకు, సాయంత్రం 5.00 గంటల నుంచి 7.00 గంటల వరకూ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థినీ, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో సెయింట్ మార్క్స్ స్కూల్ కరస్పాండెంట్ జయకుమార్, ఏడుకొండలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆంజనేయులు

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - పామూరు

వేసవిలో ప్రజల దాహార్తీ తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినంద నీయమని కనిగిరి ఎఎంసిచైర్మన్ యారవ రమాదేవి భర్త యారవ శ్రీనివాసులు తెలిపారు. స్థానిక సిఎస్‌పురం బస్టాండ్ సెంటర్ వద్ద స్వయంకషి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ పట్టణంలోని పలు సెంటర్లో దాతల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల ద్రాహం తీర్చడం సంతోషకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడుగు శ్రీనివాసులు, కౌలూరి రహంతుల్లా ,శేషం మోషా, నాయబ్ రసూల్ పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యారవ శ్రీనివాసులు

లభ్యం కాని ఐశ్వర్య ఆచూకీ

- అన్ని కోణాల్లో విచారిస్తున్న పోలీసులు

- నోరు విప్పని నాయనమ్మ

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం పాత శింగరాయ కొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాలిరెడ్డి నగర్‌కు మూడేళ్ల పాప ఐశ్వర్య అదృశ్యమైన విషయం తెలిసిందే. శుక్రవారం నాటికి కూడా ఐశ్వర్య ఆచూకీ లభ్యం కాలేదు. పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. గుర్తుతెలియని యువకుడికి బాలికను అప్పగించి నాయయమ్మ నోరు విప్పడం లేదు. పోలీసులు సిసి ఫుటేజీల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఐశ్వర్య నాయనమ్మ రాజేశ్వరి గుర్తుతెలియని యువకుడికి ఐశ్వర్యను అప్పగించిన వీడియోలు, ఆ యువకుడు రైల్వే స్టేషన్‌కి వెళ్లిన దృశ్యాలను పోలీసులు గుర్తించారు. రైల్వే స్టేషన్‌కి వెళ్ళిన తర్వాత పాపను అక్కడ వదిలిపెట్టి గుర్తుతెలియని మళ్లీ వెనక్కి వచ్చిన దృశ్యాలను గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తికి ఐశ్వర్యను అప్పగించిన రాజేశ్వరి మాత్రం నోరు విప్పడం లేదు. రాజేశ్వరిని గత రెండు రోజులుగా పోలీసులు విచారిస్తున్నారు. అయినప్పటికీ ఆమె నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. ఐశ్వర్య కోసం ఆమె తల్లి శిరీషా తల్లడిల్లి పోతుంది.



ఐశ్వర్య (ఫైల్)

క్రైమ్ కాలమ్

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

స్థానిక కొప్పోలు రోడ్డులోని జాతీయ రహదారి బ్రిడ్జి కింద షేక్ మహబూబ్ బాషా (65) అనే వ్యక్తి అనుమా నాస్పద స్థితిలో మృతి చెందాడు. తాలూకా పోలీసుల కథనం ప్రకారం... మహబూబ్ బాషా గత కొంతకాలంగా ఇందిరా కాలనీలోని 13వ లైన్‌లో కూతురు వద్ద ఉంటున్నాడు. మద్యానికి బానిసై ఇంట్లో అన్నం తింటూ గత నాలుగేళ్లుగా జాతీయ రహదారి బ్రిడ్జి కింద బల్లపై నిద్రిస్తున్నాడు. శుక్రవారం అనుమానస్పద స్థితిలో మతి చెంది ఉండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సిఐ అజయ్ కుమార్ ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ ఘటనా స్థలాన్ని సందర్శించింది. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఒంగోలు జిజిహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా తాలూకా సిఐ అజయ్ కుమార్ మాట్లాడుతూ మతదేహం ఛాతిపై చాతిపై చిన్న గాయం ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహబూబ్ బాషా మృతదేహం

వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-కొమరోలు

ఈదురు గాలుల తాడికితో మిద్దెపై నుంచి జారిపడిన ఘటనలో ఓ వృద్ధురాలు మృతిచెంది. ఈ ఘటన కొమరోలులో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... కొమరోలులోని శ్రీకృష్ణ మందిరం వద్ద గుడిమి సుశీలమ్మ(70) నివాసం ఉంటుంది. గురువారం సాయంత్రం ఆకస్మికంగా ఈదురుగాలులు వీశాయి. దీంతో మిద్దెపైన ఆరబోసిన పసుపు కొమ్ములను తీసుకొచ్చేందుకు సుశీల మిద్దె పైకి ఎక్కింది. అదే సమయంలో వీచిన బలమైన గాలులకు ఆమె కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన వైద్యశాలకు తరలి స్తుండగా మార్గమధ్యలోనే సుశీలమ్మ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఏల్చూరులో సిఐటియు ఆధ్వర్యంలో మేడే జెండా ఆవిష్కరణ

20న దేశవ్యాప్త కార్మిక సమ్మె

ప్రజాశక్తి - సంతమాగులూరు

బిజెపి, నరేంద్ర మోది నాయకత్వంలో కేంద్రంలో అధికారంకు వచ్చిన తర్వాత కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను నిర్వీర్యం చేసి కార్మికుల పొట్ట కొట్టె విధానాలు అవలంబిస్తూ లేబర్ కోడ్ బిల్లులను తీసుకొచ్చారని సిఐటియు జిల్లా నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు ఆరోపించారు. మండలంలోని ఏల్చూరు బస్టాండ్ సెంటర్లో ఆయన మేడే జెండాను శుక్రవారం ఆవిష్కరించారు. దీని ద్వారా పారిశ్రామిక పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలు పొందుపర్చడం వల్ల కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. లేబర్ కోడ్ బిల్లులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ చర్యలకు నిరసనగా ఈనెల 20న జరిగే దేశవ్యాప్త ఒకరోజు సమ్మె జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఎస్‌కె మస్తాన్ బి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు షాకిర మస్తాన్ బి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వి మస్తాన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు బ్రహ్మనాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌ఎంపిపి రాంబాబు

అధికారుల తీరుపై ఎంపిపి ఆగ్రహం

ప్రజాశక్తి - కొల్లూరు

ప్రభుత్వ కార్యకలాపాల్లో ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడంపై ఎంపిపి కమ్మెల నాంచారమ్మ, వైస్ ఎంపిపి మోరాల రాంబాబు అధికారులపై మండిపడ్డారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపిపి నాంచారమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండలంలో జరిగే అభివృద్ధి పనుల్లో స్థానిక సర్పంచులు, ఎంపిటిసీలను ఆహ్వానించకపోవడం పట్ల అధికారులను నిలదీశారు. వేసవి దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో నీటి పంపులు ఏర్పాటు చేయాలని చెప్పారు. నాడు నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మిగిలిపోయిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఎన్ శ్రీనివాసరావు, సిడిపిఓ ఎన్ జయలక్ష్మి, ఎంఈఓ జ్యోతి, విద్యుత్ ఎఈ సుధాకర్ బాబు, ఎఒ వెంకటేశ్వరరావు, ఎంపిటిసీలు, కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

రామకూరుకు తారు రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి -. పంగులూరు

మండలంలోని రామకూరు, వలపర్ల గ్రామాల మధ్య తారు రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం భూమిపూజ చేశారు. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రామకూరు నుండి వలపర్ల గ్రామం వరకు తారు రోడ్డు పనులకు శ్రీకారం చుట్టామని ఉప సర్పంచ్ పెడవల్లి అశోక్ తెలిపారు. రెండు గ్రామాల మధ్య తారు రోడ్డు గోతుల మయమై రాకపోకలకు తీవ్ర ఆటంకంగా ఉందని అన్నారు. రామకూరు గ్రామ ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని పనులు ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో రామకూరు గ్రామానికి చెందిన పలువురు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు దిక్సూచి 'దాచూరి రామిరెడ్డి'

- ఉపాధ్యాయ సంక్షేమానికి దాచురి అహర్నిశలు కృషి
- ఉత్తమ విద్యార్థులకు యుటిఎఫ్ ప్రోత్సాహక బహుమతులు



విద్యార్థులకు నగదు బహుమతి అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - చీరాల

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని ప్రారంభించి, ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఎందరో ఉపాధ్యాయులకు మార్గ నిర్దేశకులుగా నిలిచి, ఉపాధ్యాయ రంగానికి దిక్సూచిగా యుటిఎఫ్ వ్యవస్థాపకులు దాచూరి రామిరెడ్డి నిలిచారని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్ అన్నారు. స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు, కామ్రేడ్ దాచురి రామిరెడ్డి 9వ వర్ధంతి సభ యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాలు బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేసి ఉద్యమాన్ని శిఖర స్థాయికి చేర్చి, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం పాటుపడిన మహనీయులు రామిరెడ్డి అని అన్నారు. అటువంటి వ్యక్తి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాల సాధనలో కార్యోన్ముఖులు కావాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు మాట్లాడుతూ రామిరెడ్డితో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. నేడు ఉపాధ్యాయులు అనుభవిస్తున్న అనేక ఫలాలు ఆయన ఉద్యమ కీర్తికి నిదర్శనమని అన్నారు. పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని రామిరెడ్డి చెప్పిన వాస్తవాలను గుర్తించి ఆయన అడుగుజాడల్లో నడుచుకోవడమే ఆయనకు తామిచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. అనంతరం చీరాల మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 10వ తరగతి ఫలితాల్లో మొదటి స్థానం సాధించిన 15 మంది విద్యార్థులకు యుటిఎఫ్ జిల్లా నాయకులు చేతుల మీదుగా నగదు బహుమతి, జ్ఞాపికలను అందజేశారు. రామిరెడ్డి వంటి సుశిక్షితులైన నాయకత్వం, ఉపాధ్యాయ ఉద్యమంలో రామిరెడ్డి వ్యవహార శైలి, జీవితాలను పణంగా పెట్టిన రామిరెడ్డి, అనసూయమ్మ జీవితం ఆదర్శప్రాయమని కొనియాడారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు సిద్దం పాపారావు, జిల్లా కార్యదర్శి పి సురేష్, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు, సీనియర్ నాయకులు గవిని నాగేశ్వరరావు, కె వీరాంజనేయులు, గౌరాబత్తిన సూరిబాబు, ఎయిడెడ్ కన్వీనర్ కుర్ర శ్రీనివాసరావు, ఎన్ రాజేష్, సిహెచ్ వెలుగొండరెడ్డి, ఎం శ్రీనివాసులు, టి నాగమల్లేశ్వరరావు, పి శ్రీనివాసరావు, శ్రీమాన్, చీరాల ప్రాంతీయ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతిలో మంచి మార్కులు సాధించటం అభినందనీయమని ఎంఇఒ ఎ శ్రీనివాసరావు పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ అండ్ విఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలల్లో శుక్రవారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఇంకా మంచి మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం చేయాలని కోరారు. సభకు యుటిఎఫ్ మండల అధ్యక్షులు పేర్ని సత్యనారాయణ అధ్యక్షత వహించారు. తొలుత దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వినయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు పూల మాల వేసి నివాళులర్పించారు. మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన దాసరి నాగపద్మజ (గంగవరం), ద్వితీయ స్థానం సాధించిన దొడ్డి అశ్విని (పావులూరు), తృతీయ స్థానం సాధించిన గట్టుపల్లి నిషికాంత్ (ఇంకొల్లు)లతో పాటు పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులకు యుటిఎఫ్ నాయకులు చిలుకూరి హనుమంతరావు విద్యార్థులకు మెమెంటోలు బహుకరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యు వెంచయ్య, శివరామ కృష్ణప్రసాద్, శ్రీమన్నారాయణ, హెచ్‌ఎం టి ఆదినారాయణ, ఎం సత్యనారాయణ, నాగేశ్వరి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

జెండా ఊపి..బస్సులు ప్రారంభం



జెండా ఊపి బస్సులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

రాష్ట్ర రాజధాని అమరావతిలో జరుగును సిఎం మోడీ సభకు ప్రజాహజర్యేందుకు వెళుతున్న బస్సులకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య పచ్చజెండా ఊపి బస్సులను ప్రారంభించారు. టిడిపి కార్యకర్తలు గత రెండు రోజుల నుండి మోడీ పర్యటన జయప్రదం చేసేందుకు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో బస్సులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలు సభకు హాజరయ్యేందుకు ఎమ్మెల్యే కొండయ్య ఏర్పాట్లు చేశారు. బస్సులకు మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు.

బాపట్ల : రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణ పనుల పునఃప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ బహిరంగ సభకు బాపట్ల నుండి బయలుదేరే బస్సులను శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ శుక్రవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పొన్నూరు ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన భోజనాలను బస్సుల్లోకి నరేంద్ర వర్మ స్వయంగా అందజేశారు. 2024లో కూటమి ప్రభుత్వం రాకతో చీకట్లు పోయి వెలుగులు వచ్చాయని అన్నారు. నవ శకానికి నాంది పలుకుతూ అమరావతి మరోసారి వెలుగులోకి వస్తోందని అన్నారు. కూటమి పాలనలో ఆంధ్రుల ఆత్మాభిమానానికి ప్రతీకగా, అభివృద్ధి కాంక్షలకు మార్గదర్శకంగా అమరావతి మళ్లీ శక్తిని సంతరించుకుందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి నాయకత్వంలో అమరావతి గ్లోబల్ సిటీగా అవతరించి, దేశానికే తలమానికంగా నిలుస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.

యద్దనపూడి : పిఎం నరేంద్ర మోడీ అమరావతి పర్యటనకు ఏర్పాటు చేసిన బస్సులను ఎంపిడిఒ పి లక్ష్మినారాయణ శుక్రవారం పరిశీలించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయం పరిధిలోని 14 గ్రామాలకు 11బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్ణయించిన గ్రామాలకు బస్సులు పంపించి అమరావతి వచ్చే ప్రజలకు అవసరమైన హెల్త్ కిట్లు, స్నాక్స్ వంటి బిస్కెట్ ప్యాకెట్, రెండు అరటి పండ్లు, రెండు నీళ్ళ బాటిల్స్ ఇచ్చి ప్రయాణికులను రక్షితం గాతీసుకెళ్లి తీసుకొని రావాలని సిబ్బందికి సూచించారు. మధ్యాహ్నం, సాయంత్రం భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సంతమాగులూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభోత్సవానికి ప్రధానమంత్రి నరేంద్ర మోది వస్తున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల నుండి డ్వాక్రా మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరి వెళ్లారు.

కొల్లూరు : స్థానిక తెలుగుదేశం కార్యాలయం నుండి నక్క ఆనందబాబు ఆదేశానుసారం అమరావతి పునర్నిర్మాణ శంకుస్థాపన సభకు 50 వాహనాలను టిడిపి మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్ నరసింహారావు, ఎపిఎం రాము, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలి వెళ్లారు.



అమరావతి సభకు బస్సులు ప్రారంభిస్తున్న నరేంద్ర వర్మ



విద్యార్థిని ఆకాంక్షరెడ్డిని అభినందిస్తున్న సిఐ సుబ్బారావు

తైక్వాండో పోటీలో విద్యార్థినికి జాతీయ పతకం

ప్రజాశక్తి - చీరాల

డివిజినల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నాసిక్ మహారాష్ట్రలో జరిగిన ఫస్ట్ ఫెడరేషన్ కప్ సిపియు తైక్వాండో నేషనల్ ఛాంపియన్షిప్ పోటీల్లో చీరాలకు చెందిన విద్యార్థిని ఆకాంక్షరెడ్డి బ్రాంజ్ పతకం సాధించారు. పోటీల్లో ఎపికి చెందిన రాజు ఆకాంక్షరెడ్డి 29కేజీల విభాగంలో రాష్ట్రానికి బ్రాంజ్ మెడల్ సాధించిందించిన నేపథ్యంలో ఆ చిన్నారిని సిఐ సుబ్బారావు అభినందించారు. డిస్టిక్ సెక్రెటరీ, కోచ్ మల్లెల సురేష్ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో తమ విద్యార్థిని పతకం సాధించడం ఆనందకరంగా ఉందని అన్నారు.



ఈదురు గాలులకు కుప్పకూలిన కాపుకొచ్చిన బొప్పాయి

కుప్పకూలిన బొప్పాయి చెట్లు

ప్రజాశక్తి- సంతమాగులూరు

మండలంలోని పాత మాగులూరు గ్రామంలో శుక్రవారం వేకువ జామున వీచిన ఈదురు గాలులు, అకాల వర్షానికి 5 గురు రైతులకు చెందిన ఐదెకరాల కాపు కొచ్చిన బొప్పాయి తోటలోని చెట్లు విరిగి కుప్ప కూలిపోయాయి. దీంతో ఎకరాకు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

'ప్రభుత్వ' విద్యార్థులకు అభినందనలు


అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 2024- 25 సంవత్సరం పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో ప్రతిభ కనపరచి న కొవ్వూరి అక్షర 591, ఎస్ కె . కౌసరున్నీసా 590, నాగజాహ్నవి 582 మార్కులు సాధించిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.కష్ణకుమారి అధ్యక్షతన ఎస్ ఎంసి చైర్మన్ ముప్వల జగదీష్ పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల తో అభినందన సభ ఏర్పాటు చేశారు. పాఠశాల పరిధిలో మొదటి మూడు స్థానాలు కైవసం చేసుకోవడమే గాక ఒంగోలు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు మొదటి రెండు స్థానాలను కైవసం చేసుకున్న కొవ్వూరి అక్షరఎస్కే. కౌస రున్నీసా లను ప్రత్యేకంగా అభినందించి వారికి జ్ఞాపికలను బహూకరించారు. పాఠశాల ఎదురుగా ఉన్న విజయలక్ష్మీ స్టీల్ అండ్ హోమ్ అప్లయన్స్ ప్రొప్రయిటర్ మోహన్ లాల్ విద్యార్థులను ప్రశంసించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసి చైర్మన్ పాల్గొన్నారు.

కులగణన ఎప్పుడు పూర్తి చేస్తారు.?

కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బి.ఆర్.గౌస్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దేశంలో కుల గణన ఎప్పుడు పూర్తి చేస్తారో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త బిఆర్.గౌస్ డిమాండ్ చేవారు. దేశంలో కులగణన చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభలో, రాజ్యసభలో, దేశంలోని ప్రతి వేదికపై కుల గణన జరగాలని పోరాడిందన్నారు. నిత్యం రాహుల్ గాంధీ ప్రజలలో ఉంటూ, ప్రజా సమస్యలు, కులగణనపై పోరాడుతున్నారన్నారు. కేంద్రం లెక్కచేయకపోవటంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాలైన తెలంగాణ, కర్ణాటకలో ఆయా రాష్ట్రాల కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రులు కులగణన చేపట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి నేడు జనగణన తో పాటు కులగణన చేపడతామని ప్రకటించిందన్నారు. బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటు బ్యాంకు రాజకీయాల కోసం బిజెపి వేసిన ఎత్తుగడలా ఉందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారో తెలియజేయాలన్నారు. దేశంలో ఏయే కులాలు ఎంత మంది ఉన్నారో లెక్కలు తేలితేనే అణగారిన వర్గాలకు న్యాయం జరుగుతుందని, త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలని బిఆర్ గౌస్ కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి2 పరిధిలో 11కెవి సీతారాం ఫీడర్ ట్రీ కటింగ్ మరియు మెయింటెనెన్స్ నిమిత్తం సీతారామపురం, శర్మా కాలేజ్ వెనుక భాగం ఏరియాలో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు ఆటంకం ఉంటుందని, ఒంగోలు టౌన్ డిఇఇ కెవి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

'కగార్'ను నిలిపివేయాలి

- మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి
- కలెక్టరేట్ వద్ద ధర్నా


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నేతలు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

అడవుల్లో ఖనిజ సంపద, ప్రకృతి వనరుల్ని కార్పొరేట్ల సంస్థలకు దోచిపెట్టే లక్ష్యంతో మధ్య భారతంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లు ఆపాలని, అమాయక ఆదివాసీ గిరిజనుల ఊచకోతను తక్షణమే నిలిపివేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కామ్రేడ్ చిట్టిపాటి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కగార్ ఆపరేషన్‌ని ఆపి.. కాల్పుల విరమణ ప్రకటించాలని, మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలని, మధ్య భారత దండకారణ్యంలో శాంతియుత వాతావరణం నెలకొల్పాలని రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపులో శుక్రవారం నాడు ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.మోహన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిట్టిపాటి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 'ఆపరేషన్ కగార్' ఆదివాసీల అణచివేతకు దారితీస్తుందన్నారు. అపారమైన ఖనిజ నిక్షేపాలు కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పేందుకు ప్రభుత్వం ఇప్పటికే 104 ఒప్పందాలు కుదుర్చుకుందన్నారు. ఈ ఒప్పందం అమలులో భాగంగా మోడీ ప్రభుత్వం అమాయక ఆదివాసులపై హత్యాకాండ కొనసాగిస్తుందన్నారు. ఇప్పటికే అక్కడ 400 మంది ఆదివాసీలు మరణించారని ప్రభుత్వమే లెక్కలు తేల్చిందన్నారు. ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకత్వంలో ఉన్న మోడీ ప్రభుత్వం దేశంలో ఉన్న చట్టాల నిబంధనలు గానీ సాయుధ సంఘర్షణకు సంబంధించిన నియమాలు గానీ ఏమాత్రం పట్టించుకోకుండా మావోయిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలను భౌతికంగా నిర్మూలించేందుకు కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మావోయిస్టులను కేంద్రం చర్చలకు ఆహ్వానించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం ఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొండారెడ్డి, ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్, రెడ్ స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు, ప్రజా కళా మండలి రాష్ట్ర కార్యదర్శి కోటి, పిఓడబ్ల్యు రాష్ట్ర కార్యదర్శి పద్మ, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు కోడూరు నాంచార్లు, పిడిఎస్ యూ రాష్ట్ర నేత రాజశేఖర్, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షులు జాలన్న పాల్గొన్నారు.


బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు

అమరావతికి తరలిన కూటమి నేతలు

బస్సులు ప్రారంభించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

అమరావతి పునః నిర్మాణ సభకు ఒంగోలు నియోజకవర్గం నుండి కూటమి శ్రేణులు అత్యధిక సంఖ్యలో తరలివెళ్లారు. తెలుగు దేశం పార్టీ నాయకులు, మహిళలు, జనసేన, బిజెపి శ్రేణులు ఒంగోలు నుండి వెళుతున్న బస్సులకు ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు, సంతనూతలపాడు శాసన సభ్యులు బిఎన్ విజయ కుమార్, మేయర్ గంగాడ సుజాతలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ అమరావతి చరిత్రలో నేడు నవ శకానికి నాంది కాబోతుందన్నారు. కూటమి పాలనలో ఆంధ్రుల కలల రాజధాని మళ్లీ జీవం పోసుకుంటుందన్నారు. దేశానికే తలమానికంగా అమరావతి అభివృద్ధి చెందబోతుందని ఆయన తెలియజేశారు. ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ప్రజా రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులను ప్రారంభించేందుకు ప్రధాని నరేంద్ర మోడీ రావటం సంతోషంగా ఉందన్నారు. అందరి సహకారంతో త్వరలోనే ప్రజా రాజధాని అమరావతి నిర్మాణం పూర్తవుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఆందోళన

- నాలుగో రోజుకు చేరిన సిహెచ్‌ఒల సమ్మె
- కుటుంబ సభ్యులతో మోకాళ్లపై నిరసన


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఓలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని ఎపిఎంసిఎ ప్రకటించింది. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సిఐటియు అండగా నిలుస్తుందని ఆ సంఘ నాయకత్వం భరోసా ఇచ్చింది. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్(కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు)లు రెండేళ్లగా జీతాల సమస్యలు ఎదుర్కొంటున్నారు. తమ న్యాయమైన కోర్కెలు తక్షణమే పరిష్కరించాలని, డిమాండ్ చేస్తూ ఎపిఎంసిఎ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన నాలుగో రోజుకు చేరింది. శుక్రవారం నాడు కలెక్టరేట్ ఎదుట సిబ్బంది ప్లకార్డులు చేపట్టి మోకాళ్లపై బైటాయించి శాంతి యుతంగా నిరసన చేపట్టారు. వారి కుటుంబసభ్యులు కూడా ప్లకార్డులు చేపట్టి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ తమ డిమాండ్ లను తీర్చేవరకు శాంతియుతమైన నిరసనలు కొనసాగిస్తా మని ప్రకటించారు. ఎపిఎంసిఎ రాష్ట్ర నాయకులు మందగిరి రాజేష్ మాట్లాడుతూ 23 శాతం హైక్, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, తదితర సమస్యల మీద ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ పోరాటానికి సిఐటియు జిల్లా అధ్యక్షుడు కాలం సుబ్బారావు పాల్గొని.. మద్దతు తెలిపారు. సుబ్బారావు మాట్లాడుతూ ప్రభుత్వం మొండివైఖరి విడనాడి సమస్యను మరింత జటిలం కాకుండా చర్చల ద్వారా పరిష్కారం చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం మూర్ఖంగా వ్యవహరిస్తే ఉద్యమాన్ని మరింత ఉధతం చేస్తామని హెచ్చరించారు. ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. ఈ సమస్యలు పరిష్కారమయ్యే వరకు సిఐటియు, సిఐటియు అనుబంధ సంఘాలు అండగా వుంటాయని ప్రకటించారు. కార్యక్రమంలో ఎపిఎంసిఎ జిల్లా అధ్యక్షులు నిర్మల, కార్యదర్శి ప్రసన్న, కో-ఆర్డినేటర్ దీప్తి, కామేష్, నవీన్, రామాంజనేయులు, జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న 538 మంది సిహెచ్ఓలు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని రాచర్ల రైల్వే గేట్ సమీపంలో ఉన్న సెయింట్ పాల్స్ పాఠశాల ఆవరణలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సిటీ సంస్థ ఆధ్వర్యంలో ఆధార్ సేవ కేంద్రాన్ని శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు కావడి వెంకటేశ్వర్లు, నాగభూషణం రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ ఆధార్ అప్డేట్ సెంటర్‌లో ఆధార్ కార్డులో ఉన్న పేరు తప్పులను సరి చేసుకోవడంతో పాటు ఫోటో అప్డేట్, వేలిముద్రల అప్డేట్, చిరునామా మార్పులు, డేట్ ఆఫ్ బర్త్ మార్పులు చేసుకోవచ్చని ఆధార్ సెంటర్ నిర్వాహకులు నాగూర్ తెలిపారు. గిద్దలూరు పరిసర ప్రాంతాలలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్న విషయాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ అవకాశాన్ని ప్రజలకు కల్పించిందని, ప్రజలు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారులు వెంకటేశ్వర్లు, నాగభూషణ్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సెయింట్ పాల్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు చల్లా రమేష్, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యువ పారిశ్రామికవేత్త శిద్దా సురేష్‌బాబు జన్మదినోత్సవం ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ సురేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా పేదలకు ఆర్థిక సాయం అందించడం, వద్ధులకు పండ్లు పంపిణీ చేయడం, శివం శరణాలయంలో వద్ధులకు మూడు పూటలా పౌష్టిక ఆహారంతో భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శివం సంచార వాహనం ద్వారా ఒంగోలు నగరంలో అనాథలకు, యాచకులకు 300 మందికి పైగా అన్నదానం చేయడం మానవత్వంతో కూడిన మంచి సేవా కార్యక్రమమని కొనియాడారు. చలమయ్య మిత్రబందం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, యడ్లపల్లి సురేష్, గుడిపూడి అనిల్, మలినేని అశోక్, చింతం తిరుమల పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న ఎంఎల్ఎ ఏలూరి సాంబశివరావు

ప్రధాని సభలో ఎంఎల్ఎ ఏలూరి

ప్రజాశక్తి - పర్చూరు

రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభం సందర్భంగా అమరావతిలో ఏర్పాటు చేసిన ప్రధాని మోడీ సభకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు హాజరయ్యారు. ప్రజాప్రతినిధుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై జాతీయ జెండా చేతపట్టుకుని సభలో పాల్గొన్నారు.



సంతాపం వ్యక్తం చేస్తున్న తెలుగుదేశం నాయకులు

టిడిపి నాయకుడి మృతి పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని ఇడుపులపాడుకు చెందిన తెలుగుదేశం యువనేత అంబటి మురళి తండ్రి చిరంజీవి మృతి పట్ల తెలుగుదేశం బాపట్ల పార్లమెంటు మాజీ అధ్యక్షులు, శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు. చిరంజీవి మృతి కుటుంబ సభ్యులతోపాటు తెలుగుదేశంకు తీరని లోటని అన్నారు. మంచి వ్యక్తిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. చిరంజీవి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యాన్ని ప్రసాదించాలని కోరారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మురళిని ఫోన్లో పోరామర్శించి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి ఆదేశాల మేరకు తెలుగుదేశం మండల అధ్యక్షులు నాయుడు హనుమంతరావు, గ్రామ సీనియర్ నేత బాపయ్య చౌదరి, సురేష్, క్యాంపు కార్యాలయ ప్రతినిధులు వెంకట్, అఖిల్ పరామర్శించారు.



పి ఫోర్ సర్వే పరిశీలిస్తున్న ఎంపిడిఒ శేషమాంబ

పి-4 సర్వేను పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అమృతలూరు

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేసేందుకు ప్రభుత్వ ఏర్పాటు చేసిన పి ఫోర్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపిడిఒ శేషమాంబ సూచించారు. వివిధ గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఆమె శుక్రవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామస్తులు కూడా సర్వే పట్ల అవగాహన కలిగి సిబ్బందికి సహకరించి నమోదుకు తోడ్పాటును అందించాలని అన్నారు. సర్వే వలన పేద, మధ్య తరగతి వర్గాలతోపాటు అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల : మండలంలోని వివిధ గ్రామాల్లో పి ఫోర్ సర్వే నిర్వహిస్తున్నారు. ఈ పాటికే చీరాల పట్టణంలో సర్వే పూర్తి చేసినట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు. పట్టణంతో పాటు గ్రామాల్లో సర్వేలో వచ్చిన సమాచారం ఆధారంగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అవసరమైన ప్రణాళిక చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సర్వే వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుందని అధికారులు తెలిపారు.

వేసవిలో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

ప్రజాశక్తి - అద్దంకి

వేసవిలో పెరిగిన ఎండలతోపాటు వరుసగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. జనావాసాలు, పరిశ్రమల్లో ఊహించని విధంగా చోటు చేసుకుంటున్న ప్రమాదాల్లో భారీగా ఆస్తి నష్టంతో పాటు ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంటుంది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో తాటాకు పూరి గుడిసెల్లో ఎక్కువ మంది నివాసాలు ఉండేవారు. అవి త్వరగా కాలి ఎక్కువగా అగ్నిప్రమాదాలు జరిగేవి. ప్రస్తుతం మిద్దెలు, భవనాల్లో నివాసం ఉంటున్నా అగ్ని ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. నివాస గృహాలు, వాణిజ్య భవనాల్లో ప్రమాదం జరిగితే మంటలు అదుపు చేయడం కష్టంగా మారుతోంది. చిన్న అపార్ట్ మెంట్లు, ఇండిపెండెంట్ ఇళ్లల్లో అగ్ని ప్రమాదాల నుండి ప్రజలు సులభంగా తప్పించుకోగలుగుతారు. కానీ ఆకాశహర్మ్యాల్లో ఊహించని సంఘటనలు జరిగితే బాధితులను కాపాడటం కష్టంగా మారుతోంది. అందుకే ముందుగా అగ్ని ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అగ్నిప్రమాదాలు ఎప్పుడు ఎలా జరుగుతాయో ఎవరికీ తెలియదు. అందరూ అప్రమత్తంగా ఉంటే వాటిని నివారించడం చాలా తేలికని అగ్నిమాపక శాఖ అధికారులు అంటున్నారు. కాబట్టి అగ్నిప్రమాదాలు నివారించడానికి, ఒకవేళ జరిగిన సందర్భాల్లో ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశాల గురించి ఫైర్ అధికారులు వివరాలు తెలిపారు.

విద్యుత్తు షార్ట్ సర్క్యూట్, అతిగా వేడి అయ్యే విద్యుత్తు ఉపకరణాలు, నాణ్యత లేని విద్యుత్తు ఉపకరణాలు వాడటం వల్ల అగ్ని ప్రమాదాలు జరగొచ్చు. వంట గ్యాస్ లీక్ వంటివి అగ్ని ప్రమాదాలకు కారణం అవుతాయి. అగ్నిమాపక శాఖ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదం జరగదు. అపార్ట్‌మెంట్లలో అగ్ని మాపక పరికరాలన్నీ అమర్చి వాటిని సక్రమంగా నిర్వహించాలని, నిపుణులైన సూపర్వైజర్లను నియమించాలని సూచిస్తున్నారు. ఎత్తైన భవనాల్లో ఫైర్ సేఫ్టీ సిస్టమ్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అందులో భాగంగా ఫైర్ స్ప్రింక్లర్ వ్యవస్థ ఏర్పాటు చేయాలి. అగ్నిప్రమాదం జరిగితే వెంటనే గుర్తించి హెచ్చరించే వ్యవస్థ ఉండాలి. కారిడార్లు, మెట్ల మార్గాలు



మంటలను అదుపు చేసే పరికరాలు

ఎటువంటి అడ్డంకులు లేకుండా ఉంచాలి. స్ప్రింక్లర్లు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. ప్రమాదాలు నివారించడానికి ఐఎస్ఐ మార్కు కలిగిన వైరింగ్ సామగ్రిని భవనాలకు వినియోగించాలి. వంట గదిలో గాలి, వెలుతురు ఉండే విధంగా చూసుకోవాలి. కాలంచెల్లిన గ్యాస్ పైపులు వాడకూడదు. గ్యాస్ లీకవుతున్నట్లు అనుమానం వస్తే సంబంధిత కంపెనీ వారికి వెంటనే సమాచారం చేరవేయాలి. వేసవిలో ఎక్కువ రోజులు ఫ్యామిలి అంతా ఊర్లకు వెళ్లేటప్పుడు ఎలక్ట్రికల్ మెయిన్ ఆఫ్ చేసి వెళ్లడం మర్చిపోకూడదు. వంట చేసిన తర్వాత రెగ్యులేటర్ ఆఫ్ చెయ్యాలి. చిన్నారులను మండే స్వభావం ఉన్న వస్తువులకు దూరంగా ఉంచాలి. దూర ప్రాంతాలు, ఇరుకు ప్రదేశాలకు అగ్నిమాపక యంత్రాలు తీసుకురావడం కొంత కష్టంతో కూడుకున్న పని. ఇంట్లో జరిగే ప్రమాదాలను ఎవరికి వారు సరైన అవగాహనతో నివారించేందుకు మార్కెట్లో వివిధ సాధనాలు అందుబాటులో ఉంటున్నాయి. చేతులతో పట్టుకుని వినియోగించేలా ఫైర్ ఎక్విప్‌షర్లు ఉన్నాయి. భారీ ఖర్చుతో కలల సౌధాన్ని నిర్మించుకునేవారు మరి కొద్దిపాటి ఖర్చుతో వీటిని అమర్చుకోవడం ముఖ్యం.

మంటల రకాలను తెలుసుకోవాలి

క్లాస్ ఎ : కలప, కాగితం, వస్త్రం వంటి కార్బన్ ఆధారిత ఘన పదార్థాల నుంచి వచ్చేవి.

బి : పెట్రోల్, డీజిల్, గ్యాసోలీన్, టర్పంటైన్ల వల్ల వచ్చేవి.

సి : మీథేన్, ప్రొఫేన్, బ్యూటేన్ వాయువుల వల్ల ఏర్పడేవి.

డి : లిథియం, మెగ్నీషియం, అల్యూమినియం వంటి లోహాలు కాలడం ద్వారా వచ్చే మంటలు.

ఇ : విద్యుత్ ఉపకరణాల వల్ల ఏర్పడే మంటలు

ఎఫ్ : కొవ్వులు, వంట నూనెల వల్ల సంభవించేవి.

ఫైర్ ఎక్స్‌స్టంగ్విషర్లు - రకాలు

మంటలను ఆర్పేందుకు ఉపయోగించే ఫైర్ ఎక్స్‌స్టంగ్విషర్లలో చాలా రకాలున్నాయి. ప్రధానంగా నీటితో చల్లార్చేవి, వెట్ కెమికల్తో, పౌడర్తో, కార్బన్ డైయాక్సైడ్తో, నురుగుతో ఆర్పే సాధనాలను ఇళ్లలో అందుబాటులో ఉంచుకోవచ్చు. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

స్టాండర్డ్ వాటర్ : కాగితం, కార్డ్బోర్డ్, ప్లాస్టిక్, కలప, ఫ్యాబ్రిక్, ఇతర ఘన పదార్థాల నుంచి వచ్చే మంటలను ఆర్పొచ్చు.

డ్రైవాటర్ మిస్ట్ : దీని ద్వారా నీటి రేణువులు పొడి సూక్ష్మకణాలుగా మారి అగ్నిని అదుపు చేస్తాయి.

వెట్ కెమికల్ : మంటలపై సబ్బు ద్రావణాన్ని పిచికారీ చేస్తుంది. కొవ్వులు, వంట నూనెల వల్ల సంభవించే వాటిని అదుపులోకి తేవచ్చు.

కార్బన్ డైయాక్సైడ్ : పెట్రో ఉత్పత్తులు, విద్యుత్తు వల్ల కలిగే మంటలు అదుపు చేయొచ్చు.

ఫోమ్ ఎక్విప్‌గ్విషర్ : కలప, కాగితం, వస్త్రం వంటి ఘన పదార్థాల వల్ల వచ్చే మంటలు అదుపు చేయవచ్చురు.

వాటర్ మిస్ట్ టైప్ ఫైర్ : ఈ పరికరాన్ని బాల్కనీ, వరండాలు, వంట గది ప్రాంతాల్లో ఏర్పాటు చేసుకునేలా లభ్యమవుతాయి. ఇది మంటలపై నీటిని వర్షంలా చిమ్ముతుంది.

ఫైర్ బాల్ : ఫుట్బాల్ పరిమాణంలో ఉండే ఫైర్ ఎక్స్‌గ్విష్ బాల్‌ను మంటల్లో విసరగానే అది పేలుతుంది. అందులో నుంచి వచ్చే రసాయనాలు అగ్నిని అదుపు చేస్తాయి.

పౌడర్ : ఎబిసి, ఎల్2, ఎం28 రకాలుగా ఈ సాధనాన్ని విభజించారు. ఎబిసి ఎక్స్‌స్టింగ్విషర్ ద్వారా కలప, కాగితం, వస్త్రం వంటి కార్బన్ ఆధారిత మంటలు, పెట్రోల్, డీజిల్, గ్యాసోలిన్, టర్పంటైన్ వంటి వాటి నుంచి వచ్చే మంటలు, మీథేన్, ప్రొపేన్, బ్యూటేన్ వంటి వాయువుల వల్ల ఏర్పడేవి ఆర్పేందుకు ఉపయోగిస్తారు. ఎల్2 రకం ద్వారా లిథియం, సోడియం, మెగ్నీషియం వంటి రసాయనాలతో ఏర్పడే మంటలను ఆర్పొచ్చు. ఎం28 పౌడర్ ఎక్స్‌స్టింగ్విషర్ ద్వారా విద్యుత్తు ఉపకరణాల నుంచి వచ్చే మంటలు ఆర్పి వేయవచ్చన్నారు.

అమరావతి పనుల ప్రారంభ సభకు తరలిన నేతలు



అమరావతికి వెళ్లే బస్సులు ప్రారంభిస్తున్న సాయిబాబా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

అమరావతి రాజధాని పున నిర్మాణానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ సభకు మండలంలో 15 ఆర్టీసి బస్సులు ఏర్పాటు చేశారు. భట్టిప్రోలు నుండి మూడు బస్సులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి సాయి బాబా జండా ఊపి ప్రారంభించారు. స్వచ్ఛందంగా కార్లు, ఆటోలు ఏర్పాటు చేసుకుని సభకు తరలి వెళ్లారు.

సంతనూతలపాడు : అమరావతి సభకు మండలం నుంచి 10 బస్సుల్లో టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, ప్రజలు తరలివెళ్లారు. పేర్నమిట్ట మినహా మండలంలోని మిగిలిన గ్రామాలకు బస్సులు ఏర్పాటు చేశారు. బస్సులను తహశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి, టిడిపి అధ్యక్షులు మద్దినేని హరిబాబు పంపించారు. శాసనసభ్యులు బిఎన్ విజయకుమార్ పర్యవేక్షణలో బస్సులు తరలి వెళ్లాయి. జిల్లా సర్వే శాఖ అధికారి కె గౌస్‌బాషా, ఎంపీడీవో డి సురేష్‌బాబు, యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు, బొడ్డపాటి చంద్రశేఖర్, నాదెండ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

టంగుటూరు : అమరావతి సభకు జరుగుమల్లి టిడిపి అద్యక్షులు పోకూరి రవీంద్రబాబు ఆద్వర్యంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. వెళ్ళిన వారిలో కామే పల్లి మాజీ సర్పంచి ఏలూరి రాంబాబు, నరాల సోమయ్య, కొండూరి శివ కోటిరెడ్డి, కొమ్మాలపాటి కృష్ణ, రావి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



టంగుటూరు నుండి వెళుతున్న టిడిపి నాయకులు

ఉద్యోగాలకు 13 మంది ఎంపిక

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులు 13 మంది లుమినా దాటమాటిక్స్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. ప్రాంగణ ఎంపికలకు కంపెనీ హెచ్ఆర్ మైఖేల్ విచ్చేసి విద్యార్థులకు మొదట వ్రాత పరీక్షా, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్ రౌండ్, హెచ్ఆర్ రౌండ్ నిర్వహించారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులు ట్రైనీ ఇంజినీర్ రోల్‌లో లుమినా దాటమాటిక్స్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తారని, వార్షిక వేతనం రూ.3లక్షల నుండి రూ.4లక్షలు ఉంటుందని ప్లేసెమెంట్ అధికారి ఎన్వి రఘు బాబు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, డైరెక్టర్ డాక్టర్ ఎవి భాస్కరరావు, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక అభినందించారు.



ఎంపికయిన విద్యార్థులతో కళశాల అధ్యాపకులు



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సిబ్బంది

కిశోర బాలికలకు వేసవి శిక్షణ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని పల్లపట్ల ఐసిడిఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో కిశోర వికాసం వేసవి శిక్షణ ప్రారంభించారు. 15 నుండి 18 ఏళ్ల బాలికలకు ఈనెల 2నుండి జూన్ 10వరకు ప్రతి మంగళ, శుక్రవారం నిర్వహించనున్నట్లు సిడిపిఒ అనసూయ తెలిపారు. ఓఐసిడిఎస్ హెల్త్, వెలుగు, జిఎస్డబ్ల్యూఎస్ డిపార్ట్మెంట్స్ ఆధ్వర్యంలో కిశోరి బాలికలకు చదువు ప్రాముఖ్యత, బాల్య వివాహాల వలన వచ్చే నష్టాలు, బాలల హక్కులు, వ్యక్తిగత పరిశుభ్రత, పొదుపు ఖాతా మొదలగు విషయాలు గురించి అవగాహన కల్పించారు.



పేకాడుతున్న జూదరులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పేకాట జూదరులు అరెస్ట్

ప్రజాశక్తి - వేటపాలెం

మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ వివేకానంద కాలనీలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారంతో ఎస్ఐ మీసాల వెంకటేశ్వర్లు తన సిబ్బందితో హుటాహుటిన పేకాట శిబిరంపై దాడి చేశారు. ఏడుగురు పేకాట రాయిళ్లను అరెస్టు చేశారు. వారి వద్ద రూ.4800 నగదు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
శనివారం 3 మే 2025

కిశోర బాలికలకు వేసవి శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన బాలికలు, అంగనవాడీ కార్యకర్తలు



ముప్పవరంలో బాలికల అవగాహన కార్యక్రమ దృశ్యం



మాట్లాడుతున్న రేపల్లె సిడిపిఒ ఎం సుచిత్ర

ప్రజాశక్తి - అద్దంకి

'కిశోర వికాసం' కార్యక్రమం బాలికలకు సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం అమలు చేస్తుందని అంగనవాడి కార్యకర్తలు పేర్కొన్నారు. మండలంలోని నాగులపాడు అంగనవాడి పాఠశాల్లో శుక్రవారం కిషోర్ బాలికలకు అవగాహన కల్పించారు. ఆరోగ్యం, పోషణపై అవగాహన, విద్యపై ప్రోత్సాహం, వ్యక్తిత్వ వికాసం, చట్టాలు, హక్కులపై అవగాహన, వైద్య సేవలు, రిఫరెన్స్ నైపుణ్యాభివృద్ధి వంటి అంశాలపై మే2 నుండి జూన్ 10 వరకు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారంలలో జరుగుతుందని తెలిపారు. బాలికలు రుతుక్రమం సమయంలో శుభ్రత పాటించాలని, రక్తహీనత నివారణకు ఐరన్ టాబ్లెట్లు వినియోగించాలని చెప్పారు. పాఠశాలలను విడిచే బాలికలను మళ్లీ చదువు వైపు మళ్ళించడం, ఆత్మవిశ్వాసం, సంభాషణ నైపుణ్యాలు, అభివృద్ధి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, బాల్య వివాహాల నిషేధం, ఫోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో నాగులపాడు అంగనవాడి కార్యకర్త వై అనితాదేవి, వై ధనలక్ష్మి, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని కారంచేడు పంచాయతీలో కిషోర బాలికలకు వేసవి శిక్షణ శిబిరాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ హిమబిందు శుక్రవారం ప్రారంభించారు. పంచాయితీ సెక్రటరీ రమేష్ కిషోర బాలికలను పరిచయం చేసుకొని వారి లక్ష్యాలు తెలుసుకున్నారు. శిక్షణ మే 2 నుండి జూన్ 10 వరకు కొనసాగుతుందని సూపర్వైజర్ హిమబిందు చెప్పారు. అందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. శిక్షణ వారంలో మంగళ, శుక్రవారం జరుగుతుందని తెలిపారు. బాలికలు ఒకరికొకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ధారించుకోవడం అనేది శుక్రవారం యూట్యూబ్ ద్వారా లింక్ షేర్ చేసి శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. శిక్షణకు ఎంఎస్‌కె కన్వీనర్‌గా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడి కార్యకర్తలు, ఎఎన్‌ఎం, ఆశ, విఒఎ వీరందరూ శిక్షణకు సభ్యులుగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

పంగులూరు : కిషోర బాలికలు చదువుతో పాటు ఆరోగ్యం వైపు దృష్టి పెట్టాలని ఐసిడిఎస్ ముప్పవరం సెక్టార్ సూపర్వైజర్ ఎన్ పద్మజ అన్నారు. ముప్పవరం గ్రామంలో కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. బాలికలు వయసుతోపాటు చదువు, ఆరోగ్యం విషయాల్లో జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ప్రభుత్వం బాలికల ఆరోగ్యం పట్ల అనేక పథకాలు ప్రవేశపెడుతుందని చెప్పారు. అందుకు అనుగుణంగా వ్యవహరించాలని కోరారు. కౌమార బాలికలు సాధికారతవైపు పయనం అనే అంశంపై అవగాహన కలిగించారు. అంతకుముందు కిషోర బాలికల పరిచయం నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్‌ఎం శేష కుమారి, అంగన్‌వాడీలు ఐ శ్రీలక్ష్మి, పి ప్రసన్నకుమారి, బి శ్యామల, పి సుధారాణి, ఆశా కార్యకర్తలు ఎ సుమ్మ, వెంకాయమ్మ పాల్గొన్నారు.

వేటపాలెం : 'కిషోర వికాసం' వేసవి సెలవుల శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్ పుష్పవల్లి సూచించారు. మండలంలోని వేటపాలెం నాయనపల్లి1 అంగన్‌వాడి సెంటర్ నందు శిక్షణా తరగతులు శుక్రవారం ప్రారంభించారు. అంగన్‌వాడి కార్యకర్త బుల్లమ్మాయి కిషోర బాలికల పరిచయం చేశారు. బాలికలందరూ ఎవరి లక్ష్యాలను వాళ్ళు నిర్దేశించుకోవాలని చెప్పారు. అందుకు తగ్గ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఓఆర్‌ఎస్ పాఠశాల పరిసర ప్రాంతాల్లోని 11 ఏళ్ల నుండి 18 ఏళ్ల లోపు బాలికలను శిక్షణకు హాజరు పర్చారు. శిక్షణ మే 2నుండి జూన్ 10వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళ, శుక్రవారాల్లో శిక్షణా తరగతులు జరుగుతాయని అన్నారు. బాల్య వివాహాలు అరికట్టడం, ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించటం, డ్రాపోర్ట్స్ లేకుండా చూడటం తదితర విషయాల గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు అన్నపూర్ణ, సుప్రద, నాగేశ్వరి పాల్గొన్నారు.

రేపల్లె : యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు 'కిశోరి వికాసం' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఐసిడిఎస్ రేపల్లె ప్రాజెక్ట్ సిడిపిఓ ఎం సుచిత్ర పేర్కొన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక శివాజీ స్కూలులో శుక్రవారం కిశోర వికాశం అవగాహన కల్పించారు. ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోర వికాసం పునః ప్రారంభం పునాది వేస్తుందని అన్నారు. బాల్యం నుంచి యుక్త వయసు వరకు ఎవరి నుంచి మోసపోకుండా కిశోర బాలికలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి బాలిక తన పూర్తి సామర్థ్యాన్ని తెలుసుకోగలిగేలా సమగ్రాభివృద్ధి సొంతం చేసుకొనేలా చేయూత ఇవ్వనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, ఎన్జీఓల సమన్వయంతో కార్యక్రమం ప్రారంభమైందని అన్నారు. 11నుండి 18 ఏళ్ల బాలికలకు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన మెరుగుపర్చడం కార్యక్రమ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి గ్రామంలో బాలికల సంఘాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు, సమస్య పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. బాలికల్లో ఆత్మరక్షణ శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం, డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, ఆన్‌లైన్ వేదికలపై జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైసర్ పి నాంచారమ్మ, ఆర్ వెంకటరత్నమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిషోర బాలికలు పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని పావులూరులో కిషోర్ బాలికలకు వేసవి శిక్షణ శిబిరాన్ని సిడిపిఓ ఝాన్సీ శుక్రవారం ప్రారంభించారు. కిషోర బాలికలను పరిచయం చేసుకొని వారి లక్ష్యాలు తెలుసుకున్నారు. అంగన్‌వాడి కార్యకర్తలు. ఎఎన్‌ఎం, ఆశ, విఓఎ అందరూ ఈ శిక్షణ సభ్యులుగా వ్యవహరిస్తారని అన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ వాణి, మహిళా సంరక్షణ కార్యదర్శి హర్షిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : కిషోర బాలికలు స్నేహ సంబంధాలు కలిగి ఉండాలని, తద్వారా వారిలో జరిగే పలు అంశాలపై ఎప్పటికప్పుడు చర్చించుకుంటే ఎందుగుదలకు దోహదపడుతుందని అమర్తులూరి ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ జి విజయలక్ష్మి సూచించారు. భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో కిశోర వికాసంపై వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు సంపూర్ణ, విజయలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు ఉన్నారు.



మాట్లాడుతున్న కారంచేడు పంచాయితీ కార్యదర్శి రమేష్



శిక్షణ శిబిరం ప్రారంభించిన ఇంకొల్లు సిడిపిఓ ఝాన్సి



మాట్లాడుతున్న భట్టిప్రోలు సిడిపిఓ విజయలక్ష్మి

సమాన పనికి సమాన వేతనం కార్మికుల హక్కు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం వెంకట వాహిని

ప్రజాశక్తి - చీరాల



మాట్లాడుతున్న జడ్జి ఎం వెంకట వాహిని

సమాన పనికి సమాన వేతనాలు పొందడం ప్రతి కార్మికుని హక్కని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం వెంకట వాహిని అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామకృష్ణాపురంలోని ఎబిసి ఫ్యాషన్స్ వద్ద అంతర్జాతీయ కార్మిక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్మికుల హక్కులు కాపాడటంలో, వేతనాలు మెరుగు పర్చడంలో, మెరుగైన పని పరిస్థితులు సాధించడంలో కార్మికులు సాధించిన పురోగతిని, చేసిన కృషి, విజయాలు సాధించిన వారికి నివాళులర్పించడానికి కార్మిక దినోత్సవాన్ని జరుపుకుంటారని తెలిపారు. లైంగిక వేధింపులు, లోక్ అదాలత్ సేవలు, కార్మిక చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రమేష్ బాబు, ఎం రామకృష్ణారెడ్డి, యు స్నేహ, ఎబిసి ఫ్యాషన్స్ అధినేత ఎ పద్మావతి, పిఎల్‌వి డి మతీన్, మేనేజర్ ఎ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల



ఫుట్‌బాల్ టోర్నమెంటుకు హాజరైన క్రీడాకారులు

స్థానిక ఎన్‌ఆర్ అండ్ పిఎం బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో కావూరి పవన్ కుమర్ జ్ఞాపకార్థం రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. నూతలపాటి దేవదాస్ నల్లమల జిల్లా ఫుట్బాల్ కో ఆర్డినేటర్ నూతలపాటి విజయకుమార్ ఆధ్వర్యంలో జరుగుతున్న టోర్నమెంట్ మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. పోటీలకు రాష్ట్ర నలుమూల నుండి 20 జట్ల ఫుట్ బాల్ క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు నగదు అందిస్తున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా భోజన, వసతి సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో లోవోల్టేజి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - పంగులూరు



నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

గత కొన్నేళ్లుగా ఓల్టేజీ సమస్యతో సతమతం అవుతున్న చిన్న మల్లవరం రోడ్డులోని పంగులూరు ప్రజల సమస్య నూతన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో పరిష్కారమైంది. గతంలో ఉన్న 63 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 100 కెవిఎ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఏర్పాటు చేశామని ఎఇ అనిల్‌కుమార్ తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సూచనలతో విద్యుత్ ఈఈ మస్తానరావు ఆదేశాల మేరకు ఈ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో తమ సమస్య పరిష్కారమైనట్లు ఆ ప్రాంత ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎఇ అనిల్ కుమార్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ ప్రాంత విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని, త్వరలో ఈ ప్రాంతంలో 5వేల జనాభా పథకంలో మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. అప్పుడు విద్యుత్ సమస్య ఉండవని తెలిపారు.



మద్యం దుకాణాలు పరిశీలిస్తున్న ఎక్సైజ్ అధికారులు

మద్యం గొలుసు దుకాణాలపై అధికారుల దాడులు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలో ప్రోహిబిషన్ అండ్ ఎక్సజ్ శాఖ సీఐ రెడ్ రౌతు దివాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది కలిసి అన్ని గ్రామాల్లో అక్రంగా మద్యం అమ్ముతూ గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న, మద్యం షాప్స్ చూటుపక్కల మద్యం సేవిస్తున్న వారిపై విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా మండలంలోని మద్యం షాపుల నందు ఎంఆర్‌పి ధరల పట్టిక, 21ఏళ్లు నిండిన వ్యక్తులకు మాత్రమే అమ్మబడుననే బోర్డ్స్ తనిఖీ చేశారు. ఆ బోర్డ్స్ అన్ని షాపుల్లో పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. పల్లెకోన గ్రామమంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సోమ్మంశెట్టి శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని అతని వద్ద 180ఎంఎల్ 10 సిల్వర్ స్ట్రిప్స్ విస్కీ మద్యం సిసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తమ పరిధిలో 35 కేసులు, మండల పరిధిలో 17 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమంగా మద్యం, సారాయి, బెల్ట్ షాపులు నిర్వహించే వారి వివరాలు 9440902476 నంబరుకు తెలియ చేయాలని కోరారు. వివరాలు చెప్పిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కనీస వేతన బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

కనీస వేతనాల సలహా బోర్డును తక్షణమే ఏర్పాటు చేసి పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.35వేలుగా నిర్ణయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 5న రేపల్లె ఆర్‌డిఒ కార్యాలయం వద్ద కార్మికులతో ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎఐటియుసి రాష్ట్ర సమితి సభ్యులు పి నాగాంజనేయులు తెలిపారు. స్థానిక ఏఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక కుటుంబం గౌరవ ప్రధంగా జీవించాలంటే నెలకు కనీస వేతనం రూ.35వేలుగా నిర్ణయించాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమావేశంలో సిపిఐ కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, ఎఐటియుసి నాయకులు సిహెచ్ శివశంకర్, సజ్జా రాజ బాపయ్య పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కిశోరి వికాసం పోస్టర్లను కలెక్టర్ తమీమ్ అన్సారియా శుక్రవారం ఆవిష్కరించారు. కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడుతూ కిశోరి వికాసం కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. 11 నుంచి 18 సంవత్సరాల బాలికలు బాలుర వయస్సు అభివద్ధిని, రక్షణను, సాధికారతను పంపించడం కార్యక్రమ ఉద్దేశమన్నారు. కార్యక్రమం ద్వారా పిల్లలు పెళ్లిళ్లు అడ్డుకోవటం ఆరోగ్యం, విద్య, పోషణ నైపుణ్యాలు. భద్రతా, ఉపాధికి అవకాశాలు కల్పించడం లాంటి ముఖ్య లక్షణాలను చేరుకోవటం ఉద్దేశమన్నారు. బాలబాలికల హక్కులపై అవగాహన కల్పించడం, పాఠశాలకు చేరవవడంలో సహాయం చేయటం, పరస్పర సహకారం వ్యక్తిగత అభివద్ధి, నాయకత్వ లక్షణాలు పెంపొందించడం, సరిగ్గా ఆహారం తినటం ఆరోగ్యవంతమైన జీవనం గడపటం, శారీరక మార్పులు, పెళ్లిళ్లు, పుట్టుక వంటి విషయాల్లో అవగాహన కల్పిస్తారన్నారు. బాల్య వివాహాలు, ఆన్‌లైన్ భద్రత సమస్య, వేధింపుల నుండి రక్షణ, జీవన నైపుణ్యాలు ఉపాధి అవకాశాలు, బాల కార్మికత్వం వంటి సమస్యలపై అవగాహన ప్రభుత్వ పథకాలు తెలియజేయడం, వాటిని అందించడం లక్ష్యమని తెలియజేశారు. కార్యక్రమంలో స్త్రీ, శిశు సంక్షేమం, సాధికారిత అధికారిణి, బి. హేన సుజాన, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, జిల్లా విద్యా శాఖాధికారి ఏ.కిరణ్‌కుమార్, సార్డ్స్ ఎన్జీవో ప్రతినిధి సునీల్ కుమార్, డిఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అన్సారియా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు పాకల విద్యార్థినులు

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రకాశం జిల్లా మహిళల బీచ్ కబడ్డీ జట్టుకు శింగరాయకొండ మండలం పాకల జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థినులు ఎంపికైనట్లు కోచ్ పిల్లి హజరత్తయ్య తెలిపారు. వి.అర్చన, కె.భూమిక, కె.సౌమ్య, కె. సిపోరా కె. త్రిగుణ ఈ పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ విద్యార్థినులు తూర్పుగోదావరి జిల్లా, కాకినాడలో ఈ నెల 2 నుంచి 5 వరకూ నిర్వహిస్తున్న 12వ ఆంధ్ర రాష్ట్ర అంతర జిల్లాల బీచ్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అంతర జిల్లాల బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు, కార్యదర్శి వై.పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

4న శింగరాయకొండలో కోర్టు ప్రారంభం

నలుగురు హైకోర్టు న్యాయమూర్తులు రాక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలో నూతనంగా ఏర్పాటు చేసిన సివిల్ జడ్జి కోర్టు (జూనియర్ విభాగం)ను ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు ప్రారంభించనున్నట్లు శింగరాయకొండ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నెబోయిన శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ప్రకాశం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి టి.రాజశేఖర్‌రావు, హైకోర్టు న్యాయమూర్తులు డాక్టర్ జస్టిస్ కె.మన్మథరావు, జి.రామకష్ణ ప్రసాద్, డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి మరియు జిల్లాలోని అన్ని కోర్టుల న్యాయాధికారులు పాల్గొననున్నట్లు తెలిపారు.

అమరావతి పున:ప్రారంభ సభ ఘన విజయం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గిద్దలూరు

దేశ ప్రధాని నరేంద్ర మోదీ ముఖ్య అతిథిగా, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిలో నిర్వహించబడిన పున్నప్రారంభ సభ విజయవంతంగా ముగిసిందని ఈ మహాసభలో గిద్దలూరు నియోజకవర్గానికి చెందిన కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడం గర్వకారణమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సభ విజయవంతానికి సహకరించిన, మద్దతు తెలిపిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకి, అభిమానికి ఎమ్మెల్యే అశోక్ రెడ్డి హదయపూర్వక కతజ్ఞతలు తెలిపారు.


అమరావతి పున:ప్రారంభం సభా ప్రాంగణం వద్ద మంత్రులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి..
- ప్రజాశక్తి, ఒంగోలు కలెక్టరేట్

ప్రభుత్వ బడులను రక్షించుకుందాం

- రామిరెడ్డి వారసులుగా అది మన బాధ్యత
- 'దాచూరి' వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-దర్శి

'ప్రభుత్వ బడులను రక్షించుకుందాం.. ఎన్‌రోల్‌మెంట్‌ను పెంచుకుందాం..' ఇది రామిరెడ్డి వారసులుగా మన బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. దర్శిలోని పిజిఎన్ కల్యాణ మండపంలో యుటిఎఫ్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.అబ్దుల్‌హై అధ్యక్షతన శుక్రవారం దాచూరి రామిరెడ్డి వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా పాత కోర్టు సెంటర్‌లో దర్శి యుటిఎఫ్ డివిజన్ ఆధ్వర్యంలో రామిరెడ్డి వర్ధంతి సందర్భంగా చలివేంద్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ప్రారంభించారు. తదుపరి కల్యాణ మండపంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు ద్వారా డి.రామిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాటాలే హక్కుల సాధనకు మార్గమన్నారు. సమసమాజ స్థాపన కోసం యుటిఎఫ్ పని చేస్తుందన్నారు. రాజుల కాలం నుంచి ప్రజాస్వామ్య వ్యవస్థలోకి వచ్చామని, ఈ ప్రజాస్వామ్యం రాజ్యాంగం ద్వారా మాత్రమే సాధ్యమన్నారు. రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా గడ్డపై నడయాడిన దాచురి రామిరెడ్డి ఆశయాల కోసం ప్రతి యుటిఎఫ్ కార్యకర్త పని చేయాలని, రామిరెడ్డి ఆశయాలను అతిక్రమించి పని చేసిన ఏ ఒక్క వ్యక్తి యుటిఎఫ్ కార్యకార్త కాదని అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యోగుల హక్కుల సాధనకు ప్రతి యుటిఎఫ్ కార్యకర్త నడుంబిగించాలన్నారు. ప్రజలకు నమ్మకం కలిగించేలా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ఉపాధ్యాయుడు ఏ పాఠశాలలో పని చేస్తున్నారో ఆ ప్రాంతంలోనే ఉండే విధంగా ప్రయత్నం చేయాలన్నారు. మనకు రావాల్సిన హక్కుల సాధన కోసం పోరాటాన్ని త్వరలోనే ప్రకటిస్తామని, కార్యకర్తలు సంసిద్ధులై ఉండాలన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌కె.అబ్దుల్ మాట్లాడుతూ రామిరెడ్డి మానస పుత్రిక కుటుంబ సంక్షేమ పథకమని, ఈ పథకంలో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, గౌరవ అధ్యక్షులు ఎస్.రవి, ఆడిట్ కమిటీ కన్వీనర్ రాము, జిల్లా సహాధ్యక్షురాలు జి.ఉమామహేశ్వరి, కోశాధికారి చిన్నస్వామి, జిల్లా కార్యదర్శులు మీనిగ శ్రీను, టి.రాజశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ జి.కోటేశ్వరరావు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి.విజయ్‌కుమార్, ఇ.రోశయ్య, దర్శి మండల అధ్యక్షులు, కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాసిం, అన్నెం శ్రీనివాసరెడ్డి, బత్తుల వెంకటేశ్వర్లు, కె.సురేష్‌బాబు, ఎంవి.రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖాధికారులు కె.రఘురామయ్య, బి.రమాదేవి, యుటిఎఫ్ సీనియర్ నాయకులు ఎం.ఎల్లమందరెడ్డి, ధనిరెడ్డి వెంకటరెడ్డి, అంజిరెడ్డి, యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న యుటిఎఫ్ నాయకులు

దాచూరికి ఘన నివాళి

శింగరాయకొండ: మండలంలోని మూలగుంటపాడు గ్రామంలో అభ్యుదయ విశ్రాంత ఉద్యోగుల భవనంలో యుటిఎఫ్ వ్యవస్థాపకులు, మాజీ శాసనమండలి సభ్యులు దాచూరి రామిరెడ్డి వర్ధంతి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత ఉద్యోగుల ట్రస్ట్ ఆధ్వర్యంలో దాచూరి రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూర్య చంద్రశేఖర్‌రెడ్డి, సరిపాల ఈశ్వరయ్య, తన్నీరు వెంకటేశ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, రమణారావు, డివి.రాఘవులు తదితరులు పాల్గొన్నారు.


శింగరాయకొండలో రామిరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కార్యదర్శి బెనహర్‌పై విచారణ వాయిదా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండల పరిధిలోని మట్టిగుంట గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.బెనహర్ ఇటీవల ఉప్పుగుండూరు పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా చేశారు. ఆ సమయంలో అవినీతి జరిగినట్లు పంచాయతీ 14వ వార్డు మెంబరు కనగాల శ్రీనివాసరావు పంచాయతీ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఈదుమూడి, మట్టిగుంట, ఒమ్మెవరం పంచాయతీల్లోనూ కార్యదర్శి బెనహర్‌పై పలు ఆరోపణలు వచ్చాయి. దీంతో జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు డిఎల్‌పిఒ పద్మావతి నాగులుప్పలపాడు పంచాయతీ కార్యాలయంలో గురువారం విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు హాజరు కాలేదు. దీంతో విచారణ వాయిదా వేసినట్లు డిఎల్‌పిఒ పద్మావతి తెలిపారు. బెనహర్ పనిచేసిన సమయంలో అందుకు సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో బెనహర్, ఉప్పుగుండూరు పంచాయతీ ప్రస్తుత కార్యదర్శి ఎం.కిరణ్ కుమార్, ఈదుమూడి కార్యదర్శి డివి.రంగారెడ్డి పాల్గొన్నారు.


బెనహర్‌పై విచారణ చేస్తున్న డిఎల్‌పిఓ

ఎమ్మెల్యేతో అమీతుమీకి సిద్ధం.!

'జంజనం'పై అవిశ్వాసం విషయమై టిడిపి కౌన్సిలర్ల భేటీ

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

చీరాల మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావుపై అవిశ్వాస తీర్మానం పెట్టే విషయమై సందిగ్ధత నెలకొన్న నేపథ్యంలో టిడిపి మద్దతు కౌన్సిలర్లు శుక్రవారం రాత్రి ఒక కౌన్సిలర్ నివాసంలో భేటీ అయ్యారు. ఛైర్మన్‌పై ఈ నెల 14న అవిశ్వాసంపై ఓటింగ్ జరుగనున్న నేపథ్యంలో ఛైర్మన్ జంజనం టిడిపిలో చేరిపోయారు. అవిశ్వాస తీర్మానం నెగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా సంఖ్యాబలం తగ్గకుండా క్యాంపు నిర్వహణలో భాగంగా విహార యాత్రలకు వెళ్ళిన కౌన్సిలర్లు అర్ధాంతరంగా వెనక్కి వచ్చారు. తాము పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గించుకునే విషయంలో అనూహ్య పరిణామాలు చోటు చేసుకున్న క్రమంలో తాము చేపట్టవలసిన భవిష్యత్ కార్యాచరణ విషయమై మహిళా కౌన్సిలర్ నివాసంలో టిడిపి కౌన్సిలర్లు సమావేశమయ్యారు. ఛైర్మన్‌ను పదవీచ్యుతుడిని చేసే విషయమై అందరి మధ్య వాడీవేడిగా చర్చలు సాగాయి. ఏది ఏమైనా సరే ఛైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టాల్సిందేనని తీర్మానించుకున్నారు. ఈ విషయమై స్థానిక శాసనసభ్యులు ఎం మాలకొండయ్యను కలసి తమ వాదన వినిపించాలని నిర్ణయించారు. తమకు తగిన సంఖ్యాబలం ఉన్నందున అవిశ్వాస తీర్మానంపై ముందుకు వెళ్లాలని, ఇందుకు ఎమ్మెల్యే సహకారం కోరాలని నిర్ణయించారు. అయితే ఎమ్మెల్యే ఇవాళ రాజధానిలో జరిగిన ప్రధాని సభకు వెళ్లి విజయవాడలోనే ఉన్న నేపథ్యంలో రాత్రికే ఆయన్ను కలసేందుకు వాహనాలు సిద్ధం చేసుకుని బయలుదేరి వెళ్ళారు. కాగా గురువారం పట్టణంలోని కళ్యాణమండపంలో జరిగిన టిడిపి కార్యకర్తల సమావేశంలో వారి కోరిక మేరకు మరోసారి మున్సిపల్ ఛైర్మన్ జంజనం మెడలో టిడిపి కండువా వేసి పార్టీలోకి స్వాగతించారు. ఛైర్మన్‌తో తనకు ఎలాంటి సమస్యలు లేవన్నారు. అవిశ్వాసం విషయమై తాను ఎలాంటి హామీ ఇవ్వలేదని, అది కౌన్సిలర్లకు సంబంధించిన అంశమని చెప్పారు. అవిశ్వాసాన్ని ఎదుర్కోవలసి ఉంటుందని ఛైర్మన్‌కు చెప్పానన్నారు. ఈ మాటలను బట్టి అవిశ్వాస తీర్మానం ఉంటుందని అందరూ భావిస్తున్నారు. కానీ టిడిపి మద్దతు కౌన్సిలర్లు మాత్రం అవిశ్వాస తీర్మానం విషయమై పలు రకాల సందేహాలు లేవనెత్తుతూ ఎమ్మెల్యేతోనే అమీతుమీ తేల్చుకోవాలంటూ విజయవాడ వెళ్లారు. మాజీ ఎమ్మెల్యే ఆమంచి వర్గీయులతో కలసి తమకు తగిన సంఖ్యాబలం ఉన్నందున అవిశ్వాసంపై ముందుకు వెళ్ళాలని టిడిపి కౌన్సిలర్లు భావిస్తూ ఈ విషయం గురించి ఎమ్మెల్యేకు చెప్పనున్నట్లు తెలుస్తోంది.


టిడిపి మద్దతు కౌన్సిలరు (ఫైల్)